క్లుప్తంగా

అప్పన్నకు శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొని తరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఈ పూజలు చేశారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సింహగిరిపై స్వామికి నమస్కరిస్తున్న తోట త్రిమూర్తులు దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఎమ్మెల్సీ, రాష్ట్ర దేవదాయ శాఖ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు తోట త్రిమూర్తులు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతర ఆలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ సునీల్ అందజేశారు. రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు హరి ఆయన వెంట ఉన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 6.98 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఈ లెక్కింపులో రూ.6 లక్షల 98 వేల 185 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా, వేంకటేశ్వర సేవా సంఘం నుంచి డి.నగేష్, అప్పారావు ఆధ్వర్యంలో పలువురు సేవకులు, దేవస్థానం ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం.. గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- బోదువలసలో చురుగ్గా 'గడపగడపకు'

సబ్బవరం: ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని బోదువలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని గణాంకాలతో సహా ఎమ్మెల్యే వివరించారు. గ్రామ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిటకే అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలో పాఠశాలల ఆధునికీకరణ, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోస కేంద్రాల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైవాడ కాలువ నిర్వహణలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సిబ్బందికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పలువురు కోరారు. దీనిపై స్పందించిన అదీప్‌రాజ్ సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు ఓటీఎస్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, బోదువలస సర్పంచ్ నేబర్తి శ్రీను, మాజీ సర్పంచ్ కొన సంజీవరావు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, ఉగ్గిన నాయుడు, బోను గంగునాయుడు, మోపాడ అప్పారావు, గవర రాజు, మామిడి కొండాజీ, దాసరి మధు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బోదువలసలో గడపగడపకు కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

తానాంలో నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పరవాడ: తానాం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వచ్ఛభారత్ మిషన్ బృందం పర్యటన



సంపద తయారీ కేంద్రం పనితీరును తెలుసుకుంటున్న స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ సాక్షి శ్రీవత్సవ

పరవాడ: స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ సాక్షి శ్రీవత్సవ బృందం మంగళవారం పరవాడ మండలంలో పర్యటించింది. మండలంలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పనితీరుపై ఆరా తీసింది. వెన్నలపాలెం గ్రామంలో అమలు జరుగుతున్న చెత్తతో సంపద తయారీ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పారిశుధ్యం నిర్వహణ తీరు తెన్నులను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. అనకాపల్లి డీపీవో శిరీషారాణి, జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, పరవాడ మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భారతి, ఏఈ షణ్ముఖ, వెన్నలపాలెం సర్పంచ్ వి.అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారి మంజువాణి, తదితరులు

సబ్బవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2010–11 సంవత్సరం నుంచి 2020–21 సంవత్సరం వరకూ మధ్య కాలంలో జరిగిన లావాదేవీలపై మంగళవారం ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించింది. గడిచిన పదేళ్లకు సంబంధించిన రికార్డులను మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి షేక్ బాబూరావు, సిబ్బంది ఆడిట్ బృందానికి అప్పగించారు. ఆడిట్ పూర్తయిన వెంటనే నివేదికను అందజేస్తామని ఆడిట్ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి డి.మంజువాణి, సీనియర్ అసిస్టెంట్ వీవీవీ కృష్ణ, ఎస్.రాజు పాల్గొన్నారు.

తెరిపివ్వని వరుణుడు



సబ్బవరం పోలీస్ స్టేషన్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు



సబ్బవరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

సబ్బవరం: మండలంలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. సబ్బవరంతో పాటు గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది. సబ్బవరం పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. వరిసాగుకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం



మాట్లాడుతున్న హిమాంశుప్రసాద్, తదితరులు

ఎంపీవీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వైదిక ధర్మ ప్రకారం గురువారం నుంచి శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం వైభవంగా నిర్వహించనున్నట్టు విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన వివంచి సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడారు. ఈ ఈ కార్యక్రమం వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు రాత్రి వరకు శ్రీవేంకటేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న తిరుప్పావడ సేవ, 28న శ్రీవారికి అభిషేకం, కుంకుమార్చన, 29న అర్చన, స్వామివారి కల్యాణం, 30, 31న విశేష పూజ, ఆగస్ట్ 1న శ్రీరామచంద్రమూర్తికి అభిషేకం, 2న అష్టోత్తర కలశాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పరవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చునని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో అనకాపల్లి జిల్లా యోగా జన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెన్నలపాలెం ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ యోగాసనాలు మనస్సును, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే మహోన్నతమైన సాధనమన్నారు. అనంతరం ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పెందుర్తి మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, ఎంఈవో శైలజ, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, వి.సింహాద్రి, ఎం.ముత్యాలనాయుడు, యోగా శిక్షకుడు సిహెచ్.ఆంజనేయులు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మాలో భద్రతకు ప్రాధాన్యత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

పరవాడ: ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులతో పాటు ప్రజా భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని అనకాపల్లి జిల్లా రెవెన్యూ డివిజినల్ అధికారి ఎ.జి.చిన్నికృష్ణ అన్నారు. కర్మాగారాల తనిఖీ విభాగం ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో పరిశ్రమల నిర్వాహకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కర్మాగారాల నిర్వహణతో అనకాపల్లి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. జిల్లాలో విస్తృతంగా పరిశ్రమల ఏర్పాటుతో అధిక ఆదాయం, ఎగుమతులు, ఉపాధి కల్పన సాధ్యమవుతుందన్నారు. యాజమాన్యాలు దూరదృష్టితో వ్యవహరించి పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల కాలంలో పలు పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున మరింత ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. పరిశ్రమల్లో విధిగా మాక్‌డ్రిల్ నిర్వహించి ఆన్‌సైట్, ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను అమలు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. నిత్యం పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన అనకాపల్లి జిల్లాలో 824 పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో 1.25 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. పరిశ్రమల్లో ఉన్న లోపాలను గుర్తించి యాజమాన్యాలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, జేఎస్‌పీసీఎంఏ ప్రతినిధులు జె.సుబ్బారావు, శివరాంప్రసాద్, డాక్టర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి బి.శ్రీనివాసరావు, డాక్టర్ హెచ్.లక్ష్మణరావు, గొరపూడి సర్పంచ్ పైడిరత్నం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

27న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 27న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కార్మికులకు ఐడెంటీ కార్డులు, యూనిఫాం బడ్జెట్, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గ్యాస్, వంట సామగ్రి ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని గనిశెట్టి చెప్పారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ఉపాధ్యక్షురాలు రొంగలి లక్ష్మి, నాయకుడు దేముడమ్మ, పార్వతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు



లలితా పీఠాధిపతిని దర్శించుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల లలితాపీఠానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29 వరకు చాతుర్మాస దీక్షలు జరగనుండటంతో స్వామీజీ లలితాపీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతిస్తున్నారు. అలాగే పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకుంటున్నారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు.

సబ్సిడీపై రెండు టన్నుల టమాటాల విక్రయాలు



సీతమ్మధార రైతుబజారులో టమాటా కోసం క్యూలో నిల్చున్న వినియోగదారులు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో కిలో రూ.50 చొప్పున రెండు టన్నుల టమాటాలు సబ్సిడీపై విక్రయించారు. టమాటా ధర నియంత్రణకు ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్లలో వీటిని విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి 130 వరకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాలు కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు అందిస్తోంది. మంగళవారం కూడా నగరంలోని అన్ని రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలు విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌కు 80 క్రేట్లు (రెండువేల కిలోలు) టమాటా వచ్చినట్టు ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి టమాటాలు విక్రయించారు. సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టారు. క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ లేదా రేషన్ కార్డుపై కిలో చొప్పున విక్రయించారు. ఉదయం 8.30 గంటలకే రెండు వేల కిలోల టమాటా విక్రయించేసారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల పట్ల వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీతమ్మధార రైతుబజారులో..

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజారులో వినియోగదారులు బారులు తీరారు. కిలో టమాటా రూ.50కు మంగళవారం విక్రయించారు. ఉదయం నుంచి వినియోగదారులు టమాటా కోసం క్యూ కట్టారు. మంగళవారం 109 క్రేట్ల టమాటా విక్రయించినట్లు స్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణకు శాంతి ర్యాలీ

ఏయూ క్యాంపస్: ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి జరగాలని ఏయూ విద్యార్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏయూ న్యాయ కళాశాల నుంచి మద్దిలపాలెం గేట్ వరకు ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. హక్కుల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని నినదించారు. ఏయూ న్యాయ విభాగం, రాజనీతిశాస్త్ర విభాగం, సామాజిక శాస్త్ర విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

సకల కళాకారుల సంఘం ఎన్నికలకు నామినేషన్లు



అధ్యక్ష పదవికి నామినేషన్ అందిస్తున్న జాలాది విజయ

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. అధ్యక్ష స్థానానికి రచయిత్రులు డాక్టర్ జాలాది విజయ, చెక్కా రమాదేవి, ఉపాధ్య స్థానానికి ఎం. త్రినాథరావు, పీఏ భాస్కరరావు, కార్యదర్శి స్థానానికి కె.లోకేష్, సహాయ కార్యదర్శి స్థానానికి గెంబలి జగదీష్, కోశాధికారి స్థానానికి మదుపాడ రమణి, బూడిద లక్ష్మి స్వరూప నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గాయకులు జామి శివ అప్పలరాజు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'మణిపూర్‌లో చిచ్చుకు బీజేపీయే కారణం'



సంఘీభావం తెలుపుతున్న రాజకీయ పార్టీల నేతలు

సీతంపేట: మణిపూర్‌లో రెండు నెలలకు పైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తుందని పలు రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మణిపూర్ ఘటనపై జరిగిన చర్చా గోష్ఠిలో టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్నది మత హింస, కేవలం రెండు మతాల మధ్య జరుగుతున్న పోరాటం కాదని, భూమి, వనరుల వంటి ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఇందులో మత మౌఢ్యులు, మిలిటెంట్లు పాల్గొంటున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం తవ రహస్య కార్పొరేట్ అజెండా నెరవేరేలా తెలివిగా వ్యూహాలు రచించి అమలు చెయ్యడమే నేటి సంక్షోభానికి దారి తీసిందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాజీనామా చెయ్యాలని, సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వై. కొండయ్య, ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు కె.శంకరరావు, ప్రజాపోరు నాయకుడు కె.దేవా, భారత్ బచావో నాయకుడు శ్రీనివాస్, ఆప్ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్ లోక్‌సత్తా నాయకుడు ఎంఎస్ఎస్ మూర్తి, మహిళా సమాఖ్య నాయకులు ఎ. విమల పాల్గొని సంఘీభావం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మర్రిపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ పాల లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా.. సోమవా రం రాత్రి సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న విశాఖ డెయిరీ పాలలారీ తాటిచెట్లపాలెం జాతీయ రహ దారి వద్ద సుమారు 30–40 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మంగళవారం కంచరపాలెం వీఆర్వో బాబూలాల్ ఫిర్యాదు మేరకు ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడు 5 అడుగుల పొడవు, నలుపు రంగులో ఉన్నారని, అతని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరచామని, ఆచూకీ తెలసిన వారు పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తేవాలి



బాబా ఆలయం స్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతమ్మధార: విశాఖ జిల్లాలోని సీఎన్జీ ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తీసుకు రావాలని, అన్ని ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. మంగళవారం సీతమ్మధార షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సీఎన్జీ ఆటో డ్రైవర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఆటోలపై ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీని అరికట్టాలన్నారు. నగరంలో తిరుగుతున్న ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ఈ చలానాల విధింపు ఆపాలన్నారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎన్జీ ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ సారిపల్లి ప్రసాద్, ఎస్కే బాషా, శంకరరావు, రమణ, శ్రీనివాసరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.